క్లుప్తంగా

శేష వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథ కాంప్లెక్స్‌లో నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజు మంగళవారం శ్రీరంగనాథుడు సతీసమేతుడై రాత్రి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ పురవీధులైన మెయిన్ బజార్, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వీధి, అమ్మవారిశాల మీదుగా స్వామివారి ఊరేగింపు జరిగింది. స్వామివారికి భక్తులు పూజాద్రవ్యాలు, కాయ కర్పూరాలను సమర్పించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉభయదారులచే ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ సుదీకర్‌రెడ్డి, ఈఓ రమణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవ ప్రాంగణంలో భజన బృందం భక్తి గీతాలను ఆలపించారు. ఎంతో వైభవంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలను భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దేవదేవున్ని దర్శించుకున్నారు.

రేణుక యల్లమ్మతల్లి ఆలయం ప్రారంభం



రేణుకయల్లమ్మతల్లికి పూజలు చేస్తున్న జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని అప్పరాజుపల్లె గ్రామంలో ఇటీవల వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు రఘునాథరెడ్డి నూతనంగా నిర్మించిన రేణుక యల్లమ్మతల్లి ఆలయాన్ని మంగళవారం సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆలయంలోని యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి, సురేంద్రారెడ్డి, లక్కిరెడ్డి రమణారెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

సింహాద్రిపురం : ఇంటి వద్దకే వైద్య సేవలు వస్తున్నాయని బిదినంచర్ల పీహెచ్‌సీ డాక్టర్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. మంగళవారం గురిజాల గ్రామంలోని బిదినంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఖాజామొహిద్దీన్ ఆధ్వర్యంలో గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓలు ఎం.వి.పరసాద్, వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం రమాదేవి, సీహెచ్‌ఓ లీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని రాజీవ్‌నగర్, ప్రభుత్వ ఆసుపత్రి ఫీడర్లలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 11 కె.వి. ఫీడర్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ కోతలు ఉంటాయని.. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అశ్రునయనాల మధ్య విద్యార్థి అంత్యక్రియలు

సింహాద్రిపురం : మండల పరిధిలోని బిదినంచర్ల గ్రామంలో మంగళవారం మృతి చెందిన విద్యార్థి బాబాఫక్రుద్దీన్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. సోమవారం మధ్యాహ్నం రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బిదినంచర్ల గ్రామానికి చెందిన యువకుడు బాబాఫక్రుద్దీన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లి రోదన వర్ణణాతీతం. వైఎస్సార్సీపీ మండల నాయకుడు బీఎన్ బ్రహ్మానందరెడ్డి మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు.

ఆరోగ్యశ్రీ పథకం సద్వినియోగం చేసుకోండి

కొండాపురం : దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు వైద్యం అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుదీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దత్తాపురం పునరావాస కాలనీలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా యోగా కంటి వైద్య శిబిరంను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో భారతి హాస్పిటల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ స్వరూపారాణి, సర్జన్లు డాక్టర్ శివతేజరెడ్డి, డాక్టర్ హారికరెడ్డిలచే 200 మందికి కంటి పరీక్షలు చేశారు. 42 మందికి అపరేషన్లు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



గోటూరులో ప్రజలకు పథకాలగురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : మండలంలోని తొల్లగంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. థెరిసానగర్, గోటూరు, వెంకటేశాపురం గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డిలు పాల్గొన్నారు. వారు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తూ ముందుకు సాగారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్ద ప్రజలు వారికి ఘనంగా స్వాగతం పలికారు. పలు ప్రభుత్వ పథకాల ద్వారా మాకు లబ్ధి అందుతోందని, మేమంతా జగన్ వెంటే వుంటామని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, వైఎస్ఆర్ సీపీ నేతలు శివకుమార్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, రామాంజులురెడ్డి, నిత్యానందరెడ్డి, కృష్ణమూర్తి, జంగిడి సుబ్బరాయుడు, గోసుల శివారెడ్డి, రాజేంద్రారెడ్డి, చంద్రారెడ్డి, ఆయవారు రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ జుబేద, తహసీల్దార్ అమరేశ్వరి, ఎంఈఓ లిల్లెమ్మ, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, ఏఓ సాయిజ్యోతి, ఏపీఎం శైలజ, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, పవన్, ముజీబ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : మండలంలోని కాంపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని నారాయణపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డిలు పాల్గొంటారని మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 12వ వార్డులో ఉన్న కటిక మాంసం దుకాణాలను తొలగించాలని మహిళలు ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన కమిషనర్ జగన్నాథ్‌తో మాట్లాడి వెంటనే ఈ దుకాణాలను ఎత్తి వేయాలని ఆదేశించారు. అలాగే నీటీ ట్యాంక్‌కు బోరు కనెక్షన్ ఇచ్చి నీటి సమస్య లేకుండా చేయాలని కోరారు. వాటిన్నింటీని వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ఆధరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు తన అనుకూల మీడియా ద్వారా విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మండల పార్టీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, వైస్ చైర్మన్ జైబున్నీసా, వార్డు ఇన్‌చార్జి యూసోబ్, కౌన్సిలర్లు పెన్నారషీద్, కోకోకోల గౌస్, కో-ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు గంగాకృష్ణారెడ్డి, షర్ఫుద్దీన్, వార్డు నాయకులు, సీఐ మంజునాథ్‌రెడ్డి, హౌసింగ్‌ఏఈ శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఏఈ సుబ్బయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో బుధవారం ఉదయం 6 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదర్శ గ్రామాభివృద్ధికి సహకరించండి



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న వైఎస్ మధురెడ్డి, తదితరులు

వేముల : ఆదర్శ గ్రామాభివృద్ధికి అధికారులందరూ సహకరించాలని, వేల్పుల గ్రామ పంచాయతీ అభివృద్ధిలో వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి కృషి అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి తెలిపారు. మండలంలోని వేల్పుల సచివాలయ సముదాయంలో మంగళవారం జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే వేల్పులను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఇప్పటికే గ్రామంలో రూ.13 కోట్ల పాడా నిధులతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గ్రామంలో యూజీడీ, ఇంటింటికీ కొళాయి కనెక్షన్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. క్రికెట్ స్టేడియం, నాడు-నేడు పనులతో బెస్తవారిపల్లె, వేల్పుల పాఠశాలల పనులను పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉండకూడదన్నారు. గ్రామంలో నిర్మించిన సచివాలయ సముదాయ భవనాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచాయని.. వేల్పుల పంచాయతీని కూడా అబివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంగా పని చేయాలని సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి వేల్పుల, బెస్తవారిపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగనన్నకు అండగా నిలిచి ఆశీర్వదించాలని గ్రామస్తులను కోరారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఎంపీటీసీ బాబ్‌జాన్, సర్పంచ్ నిర్మల, సొసైటీ అధ్యక్షుడు మాధవరెడ్డి, పీఆర్ డీఈ రవిచంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ సుకుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి, ఏపీఓ గంగరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాలింతలు, గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

చెన్నూరు : గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు పాటించేలా చూసుకోవాల్సిన బాధ్యత సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఓలు, ఆశాలపై ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఆశాడే సందర్భంగా ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు సమయానికి అన్ని పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. అలాగే జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమామహేష్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యులు, సిబ్బంది నిర్దేశించిన ఆయా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు అక్కడ ఉండే గర్భిణులు, బాలింతలు, ప్రజలకు బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, వైద్యులు వంశీకృష్ణ, ఖాజామోదీన్, ఎంపీహెచ్‌ఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టెర్మినల్ బస్టాండు పరిశీలన



వైఎస్సార్ టెర్మినల్ బస్టాండును పరిశీలిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ టెర్మినల్ బస్టాండును మంగళవారం సాయంత్రం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. నేటి నుంచి ప్రయాణీకులు సౌకర్యార్థం వైఎస్సార్ టెర్మినల్ బస్టాండు నుంచి ఇతర ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ టెర్మినల్ బస్టాండును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయాణీకుల కోసం అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా వైఎస్సార్ జగనన్న భూ రక్ష, భూ సర్వే



డ్రోన్ ద్వారా భూ సర్వే గురించి వివరిస్తున్న ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్

చెన్నూరు : వైఎస్సార్ జగనన్న భూ రక్ష, భూ రీ సర్వేను డ్రోన్ల ద్వారా మంగళవారం స్థానిక ఎల్లమ్మ కాలనీలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు మండల సర్వేయర్ సోమశేఖర్ తెలిపారు. గ్రామ పొలాల్లో 1467.19 ఎకరాల్లో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ రైతులకు సంబంధించి సుమారు 675 ఖాతాలు, 494 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. ఈ భూ సర్వేకు సంబంధించిన ఫొటోలు రెండు నెలల తర్వాత వస్తాయన్నారు. ఇవి భూములకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని అందిస్తాయన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినందుకు రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, ఎంపీటీసీ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, వీఆర్వోలు రసూల్, జాకీర్, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్వేయర్లు పవన్‌కుమార్, వెంకటశివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశులు

పులివెందుల టౌన్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాల వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాటు చేయాలని ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో దేవాదాయశాఖా అధికారులు, పోలీసు అధికారులు, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. శివరాత్రి సందర్భంగా ఆయా ఆలయాలవద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలన్నారు. బారికేడ్‌లను, చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం, ఇతర మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పులివెందుల తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సీఐ రాజు, ఏఎస్‌ఐ చంద్రశేఖర్‌స్వామి, ఆలయాల ఈఓ కేవీ రమణ, విశ్వనాథరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఏకాంత సేవలో శ్రీవెంకటరమణుడు

నేడు వేంకటరమణుడి కల్యాణం

పులివెందుల టౌన్ : పులివెందుల నడిబొడ్డులో వెలసిన శ్రీవేంకటరమణుడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయంలోని అద్దాల మండపంలో ఏకాంత సేవ పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు నిర్వహించారు. అలాగే శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటరమణస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించాలని వారు కోరారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

జూదరుల అరెస్ట్

కమలాపురం : పట్టణంలోని సీఎస్ఐ చర్చి గ్రౌండ్ సమీపంలో జూదమాడుతున్న ఏడు మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. మంగళవారం జూదమాడుతున్న సమాచారం రావడంతో సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.9500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల..

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లె గ్రామ సమీపంలో జూదమాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.11,040 నగదును, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం సీకేదిన్నె ఇన్‌చార్జి ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

వేంపల్లె : ఏపీ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం మాదిరిగా కాంట్రాక్టు ఉద్యోగులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆయన కోరారు.

లోన్ యాప్స్ మాయలో పడవద్దు

పెద్దముడియం : లోన్ యాప్స్ మాయలో పడి మానసిక వేదనకు గురి కావద్దని రూరల్ సీఐ వెంకటకొండారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండంలోని నెమళ్లదిన్నె గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేసి మాట్లాడారు. మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడకుండా ఉండాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. సులువుగా అప్పు లభిస్తుందని ఫేక్‌లోన్ యాప్స్‌వలలో చిక్కుకోవద్దని, చిన్న మొత్తంలో అప్పు ఇచ్చి మీ నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బు కట్టించే విధంగా మోసగాళ్లు బెదిరించడం మరియు మానసిక క్షోభకు గురి చేస్తారని అనధికార లోన్ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసేటప్పుడు మీ యొక్క కాంటాక్ట్, మీడియా, గ్యాలరీలకు సంబంధించి ఎటువంటి పర్మిషన్లు ఇవ్వద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనువాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచార రథానికి భక్తుల బ్రహ్మరథం

చక్రాయపేట : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని చక్రాయపేటలోని శ్రీవేంకటేశ్వర, రాచరాయస్వామి ఆలయాల ప్రాంగణంలో జరిగే ఉత్సవాలకు భక్తులను ఆహ్వానించు నిమిత్తం వారం రోజులుగా గ్రామాల్లో తిరుగుతున్న ప్రచార రథానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మంగళవారం శివపార్వతులు, శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వాముల ఉత్సవ విగ్రహాలతో ప్రచారరథం సురభి గ్రామంలో పర్యటించింది. ఆలయ చైర్మన్ ఓబుళరెడ్డి, మాజీ చైర్మన్‌లు రామాంజులరెడ్డి, చక్రపాణిరెడ్డి, హరనాథరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారినే చట్టసభలకు పంపుదాం

జమ్మలమడుగు : ప్రస్తుత పరిస్థితుల్లో చట్ట సభల్లో ప్రశ్నించేవారినే చట్టసభలకు పంపించడం ఎంతో మంచిదని కాబట్టి రాబోయే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలోనికి దిగుతున్న పోతుల నాగరాజుకు పట్టభద్రులందరూ మద్దతు ఇవ్వాలని సీపీఎం నాయకుడు శివనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో పీడీఎఫ్ అభ్యర్థిని బలపరుస్తూ పోస్టర్‌లను విడుదల చేశారు.

శివరాత్రికి ఆలయాల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : ఈ నెల 18వ తేదీన జరిగే శివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలలో ప్రత్యేక నిఘాతో పాటు, వచ్చిన భక్తులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించేవిధంగా ఆలయ కమిటీ సభ్యులతో చర్చించాలని సంబంధిత అధికారులకు ఆర్డీఓ జి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సభాభవనంలో డీఎస్పీ నాగరాజుతో కలసి పోలీసు, రెవెన్యూ మండలస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. శివరాత్రి పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రాలైన కన్యతీర్థం, అగస్త్యేశ్వర కోన, గురప్పకోన తదితర ప్రదేశాలకు భక్తులు భారీ సంఖ్యలో వచ్చె అవకాశం ఉండటంతో భక్తుల రక్షణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. అనంతరం డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ముందుగా కమిటీ సభ్యులతో భక్తులకు ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించాలనే దానిపై చర్చించాలన్నారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ పరిధిలోని రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అవకతవకలకు ఆస్కారం ఉండకూడదు



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధి అదనపు పీడీ శివప్రసాద్

పెద్దముడియం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులల్లో అవకతవకలకు ఆస్కారం ఉండకూడదని ఉపాధి జిల్లా అడిషనల్ పీడీ శివప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 16వ విడత సామాజిక తనిఖీ, ప్రజావేదిక నిర్వహించి మాట్లాడారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఏయే పనులకు గాను ఎంత ఖర్చు చేశారో తెలియజేశారు. ప్రతి పనికి సంబంధించిన వివరాలను చదివి వినిపించారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు రూ.5.40 లక్షల వరకు గుర్తించిన పనులపై ఖర్చు చేసినట్లు ప్రజలకు ప్రజా ప్రతినిధుల సమక్ష్యంలో తెలియజేశారు. చాలా ప్రాంతాల్లో నాటిన మొక్కలు చనిపోయాయని, మస్టర్లలో పేర్లు నమోదు చేయడంలో అవకతవకలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, ఏపీడీ ఖాదర్‌బాషా, ఏపీఓ హరికృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త శుద్ధి పనులపై అవగాహన కలిగి ఉండాలి



గార్బేజ్ సెగ్రెగేషన్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : చెత్త శుద్ధి పనులపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ సిబ్బందికి సూచించారు. మంగళవారం పట్టణంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను సెగ్రిగేషన్ చేయు పనులపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయు విధానంపై ప్రజలకు అవగాహన కల్పించి.. గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో చెత్తను సెగ్రిగేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా బండ్లకు జరిమానా

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఎద్దుల బండ్లకు జరిమానా విధించినట్లు పులివెందుల ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం వేంపల్లె పట్టణంలోని పాపాఘ్ని నది వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. నాలుగు ఎద్దుల బండ్లు, రెండు ట్రాక్టర్లకు జరిమానా విధించారు. ఒక్కొక్క ఎద్దుల బండికి రూ.2వేలు, ట్రాక్టర్‌కు రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. మళ్లీ రవాణా నిర్వహిస్తే జరిమానాతోపాటు బండ్లను సీజ్ చేస్తామన్నారు. ఎస్ఈబీ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

వేంపల్లె : పట్టణంలోని పంచాయతీ ఆఫీస్‌లో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధం వేంపల్లె మండల సమితి ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన క్యాలెండర్‌ను మంగళవారం పంచాయతీ ఈఓ రవిశంకర్‌రెడ్డి ఆవిష్కరించారు.

రెవెన్యూ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన



రెవెన్యూ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ

జమ్మలమడుగు రూరల్ : రెవెన్యూ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు మండలంలోని అంబవరం గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ స్థలాన్ని పరిశీలించారు. మంగళవారం ఆయన ఆర్డీఓ శ్రీనివాసులుతో కలసి అంబవరం గ్రామం వద్ద ఉన్న 2 ఏకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించి ఆ స్థలాన్ని ఎంపిక చేశారు. గతంలో ఇక్కడ గృహనిర్మాణ విభాగానికి చెందిన నిర్మిత కేంద్రం ఉండేదని ఆయన తెలిపారు. త్వరలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, సర్వేయర్లు హరి, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ మల్లికార్జున

లింగాల : పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల స్పెషలాఫీసర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పక్కాగృహాల నిర్మాణ పనులపై మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంతవరకు జగనన్న ఇంటి నిర్మాణాన్ని చేపట్టని లబ్ధిదారులను కలిసి త్వరితగతిన పక్కాగృహ నిర్మాణం చేపట్టే విధంగా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. నిర్మాణంలో ఉన్న గృహాల పనులను వివిధస్థాయిలను పెంపొందించాలన్నారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాను పర్యటించి ఇళ్ల నిర్మాణ స్థితిగతులను పరిశీలిస్తానని తెలిపారు. మండలంలోని పార్నపల్లె, లింగాల గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టకపోవడం విచారకరమని.. ఆ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్మాణాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, మండలస్థాయి అన్ని శాఖల అధికారులు, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.